26–5–26 rakshana main_Layout 1 6/15/2026 4:13 AM Page 1




APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

ఎడిటర్ నరేంద్ర

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | సోమవారం 15 జూన్ 2026 | వెల4/-

## దీప్తి స్పిన్ మాయు.. పాక్ 106కే ఆలౌట్




భారత మహిళల జట్టు టీ20 ప్రపంచకప్‌ను ఘన విజయంతో ప్రారంభించింది. స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అద్భుత బౌలింగ్‌తో పాకిస్థాన్ బ్యాటింగ్‌ను కుప్పకూల్చగా, భారత్ 64 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. దీప్తి ఐదు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది.



# రెండేళ్ల తీర్పు...కూటమికి ప్లస్

అమరావతి, అభివృద్ధి, లోకేష్ ఫ్యాక్టర్‌తో ముందంజ..

రెవెన్యూ, మైనింగ్, స్థానిక నేతలపై పెరుగుతున్న ప్రశ్నలు...


విమర్శల్లో జగన్‌కు మార్కులు..

ప్రత్యామ్నాయంలో మాత్రం సందేహాలు

ఇప్పటికైతే కూటమికే ఎడ్జ్...

2029 వరకు అదే కొనసాగుతుందా?

ఎడిటర్ నరేంద్ర



వివరాలు 2వ పేజీలో


## కాని పూర్తి మార్కులు కాదు..

రెండేళ్ల పాలన తర్వాత రాజకీ లెక్కలు వేస్తే కూటమికి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నప్పటికీ, 2029 ఎన్నికలు అంత తేలిక కాదనే హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి. అమరావతి, అభివృద్ధి, లోకేష్ ఎదుగుదల, సంక్షేమ పథకాల అమలు కూటమికి బలంగా మారుతుండగా, మైనింగ్ ఆరోపణలు, కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి, రెవెన్యూ వ్యవస్థపై అసంతృప్తి చంద్రబాబుకు అలర్ట్ బెల్స్ మోగిస్తున్నాయి. మరోవైపు జగన్ విమర్శలు పూర్తిగా ఫలించకపోయినా, ప్రభుత్వ లోపాలను రాజకీయ అస్త్రాలుగా మార్చే ప్రయత్నంలో కొంత మేర సక్సెస్ అవుతున్నారు. అయితే వైసీపీ సొంత నాయకుల వైఖరి, క్షేత్రస్థాయి బలహీనతలు, ప్రత్యామ్నాయ రాజకీయ అజెండా లేకపోవడం జగన్‌కు అడ్డంకిగా మారుతోంది. అందుకే ప్రస్తుతం ఎడ్జ్ కూటమిదే అయినా... వచ్చే ఎన్నికలు మాత్రం ఎవరికీ అంత ఈజీ కాదనేది రాజకీయ వాస్తవం.

## మైనార్టీ విద్యార్థులకు వక్ఫ్ బోర్డు వరం

రూ.6 కోట్లతో 250 మంది విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ కార్పొరేట్ విద్య

తాలీమ్-ఏ-హునర్ ద్వారా కొత్త భవిష్యత్తుకు బాటలు



వివరాలు 2వ పేజీలో

మైనార్టీ విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహంగా ఏపీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో 250 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ కార్పొరేట్ విద్య అందించేందుకు రూ.6 కోట్ల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. తాలీమ్-ఏ-హునర్ టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు విజయవాడలో కాలేజ్ అలాట్‌మెంట్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

## విద్యుత్ కోతలతో కంబదూరు విలవిల.

రోజుకు 30 సార్లు అంతరాయం

ప్రజల సహనానికి పరీక్ష...

స్పందించండి మంత్రి గారూ..!



వివరాలు 2వ పేజీలో

అనంతపురం జిల్లా కంబదూరు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోంది. రోజుకు 20 నుంచి 30 సార్లు విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహోపకరణాలు దెబ్బతినడం, విద్యార్థుల చదువులు, వ్యాపారాలు ప్రభావితమవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సమస్యపై విద్యుత్ శాఖ మంత్రి జోక్యం చేసుకోవాలనే డిమాండ్ బలపడుతోంది.

## ఢిల్లీలో జనసేన కీలక సమావేశం




జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం ఢిల్లీలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. "సేన ప్రస్థానం... జాతీయ సమైక్యత కోసం" పేరిట జరుగుతున్న ఈ సమావేశంలో పార్టీ భావజాలం, జాతీయ రాజకీయాలు, దేశ సమగ్రత అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు.

## సింగపూర్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం




రెండు రోజుల పర్యటనలో భాగంగా సింగపూర్ చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అక్కడి తెలుగు ప్రజలు, ఎన్నారైలు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ప్రవాసాంధ్రులు ముఖ్యమంత్రిని ఆప్యాయంగా ఆహ్వానించగా, చంద్రబాబు వారితో మమేకమై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## పేదల సొంతింటి కలలకు కూటమి ప్రభుత్వం భరోసా

2029 నాటికి అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు...

16.63 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ఆర్థిక సాయం

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమంలో రాజీ పడకుండా లక్షలాది ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.





## ఏపీకి పిడుగుల హెచ్చరిక

మూడు గంటలు అప్రమత్తంగా

ఉండాలని సూచన

పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌లు

రాగల మూడు గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేయగా, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌లు ప్రకటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



26-5-26 rakshana main_Layout 1 6/15/2026 4:13 AM Page 2



# పేదల సొంతింటి కలలకు కూటమి ప్రభుత్వం భరోసా

మొదటి పేజీ తరువాయి

అమరావతి : రక్షణ న్యూస్

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని గృహనిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**పీఎంఏవై 1.0 ఇళ్లకు వేగం...** గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయకుండా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. రాజకీయ కక్షలకు తావులేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్ 1.0) కింద రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనులను వేగవంతం చేసిన ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో లక్షలాది మందికి ఇళ్లు అందించిందన్నారు. 2025 నవంబర్ 12న మూడు లక్షల ఇళ్లను, 2026 ఉగాది సందర్భంగా మరో 2.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించామని గుర్తు చేశారు.

**పేదలకు అదనపు ఆర్థిక సాయం...** రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ పేదల విషయంలో రాజీ పడకూడదన్న నిర్ణయంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున, పీవీజీటీ కుటుంబాలకు రూ.1 లక్ష చొప్పున అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు.అదేవిధంగా మైనార్టీ లబ్ధిదారులకు కూడా రూ.50 వేల ప్రత్యేక ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

**5.98 లక్షల కుటుంబాలకు లబ్ధి..** ప్రత్యేక ఆర్థిక సహాయం పునరుద్ధరణతో రాష్ట్రవ్యాప్తంగా 5.98 లక్షల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని మంత్రి వివరించారు.ఇప్పటివరకు లక్షలాది మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. పీఎంఏవై అర్బన్ పథకం కింద జరుగుతున్న 1.19 లక్షల ఇళ్ల నిర్మాణాలకు అదనపు నిధులు కూడా విడుదల చేసినట్లు తెలిపారు.

**ఊపందుకుంటున్నగ్రామీణ్ 2.0..** ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 46,636 ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.ఇప్పటికే వేలాది ఇళ్లు పూర్తికాగా, మరో వేలాది ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పీఎంఏవై 1.0, 2.0 పథకాల కింద మొత్తం 15.82 లక్షల ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు.

**10.42 లక్షల కొత్త దరఖాస్తులు...** పీఎంఏవై 2.0 కింద రాష్ట్రవ్యాప్తంగా 10.42 లక్షల దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సొంతింటి కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

**2029 నాటికి 16.63 లక్షల ఇళ్లు..** 2024 నుంచి 2029 వరకు మొత్తం 16.63 లక్షల ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రత్యేక లక్ష్యాలు నిర్దేశించి వాటి అమలుపై2026 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పేదల సొంతింటి కలలను నెరవేర్చే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని, 2029 నాటికి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు లేదా ఇళ్ల స్థలం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు.

# ఢిల్లీలో జనసేన కీలక సమావేశం

మొదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ : రక్షణ న్యూస్

దేశ రాజధాని ఢిల్లీలో జనసేన పార్టీ సోమవారం నిర్వహించనున్న విస్తృత స్థాయి సమావేశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ రాష్ట్రాల ముఖ్య నేతలు హాజరుకానున్నారు."సేన ప్రస్థానం... జాతీయ సమైక్యత కోసం" అనే శీర్షికతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో జనసేన పార్టీ జాతీయ దృక్పథం, దేశ సమగ్రత పట్ల పార్టీ వైఖరి, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై విస్తృతంగా చర్చ జరగనుంది. ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం, భాషలను గౌరవించే సంప్రదాయం, సంస్కృతులను పరిరక్షించే సమాజ నిర్మాణం వంటి అంశాలను పవన్ కళ్యాణ్ నేతలకు వివరించనున్నారు.జనసేన పార్టీ స్థాపించి పుష్కర కాలం పూర్తయిన నేపథ్యంలో ఇప్పటివరకు పార్టీ సాగించిన ప్రస్థానం, జాతీయ సమైక్యత కోసం చేసిన కృషి, దేశ రాజకీయాల్లో జనసేన పాత్రపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. జాతీయ సమగ్రతపై జనసేన ఎలాంటి భావజాలంతో ముందుకు సాగుతోందో, భవిష్యత్‌లో ఏ విధమైన కార్యాచరణను అనుసరించబోతోందో పవన్ కళ్యాణ్ ఈ సమావేశంలో స్పష్టంగా వివరించనున్నారు.దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల పాత్ర మరింత కీలకంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాంతీయ గుర్తింపును కాపాడుకుంటూనే జాతీయ సమగ్రత కోసం ఎలా పనిచేయాలనే అంశంపై నాయకులకు మార్గనిర్దేశం చేయనున్నారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, జాతీయ ఐక్యత అవసరం, యువత పాత్ర, రాజకీయ నాయకుల బాధ్యత వంటి అంశాలు కూడా సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది.జనసేన తరఫున ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్లు, తెలంగాణ రాష్ట్ర నాయకులు, ఇటీవల కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి పార్టీలో చేరిన సభ్యులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. పార్టీ విస్తరణ, జాతీయ స్థాయిలో బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కూడా చర్చ జరిగే అవకాశముంది.సోమవారం జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదివారం ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో పార్టీ ఎంపీలు బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పార్టీ జెండాలు, నినాదాల మధ్య నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం చెప్పడం విశేషంగా నిలిచింది.న్యూఢిల్లీలోని అశోక హోటల్‌లో సోమవారం ఉదయం ప్రారంభమయ్యే ఈ సమావేశం సాయంత్రం వరకు కొనసాగనుంది. సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నాయకులు పర్యవేక్షిస్తున్నారు. జనసేన పార్టీ భావజాలాన్ని జాతీయ స్థాయిలో మరింత విస్తరించేందుకు, భవిష్యత్ రాజకీయ దిశను నిర్దేశించేందుకు ఈ సమావేశం కీలకంగా మారనుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దేశ రాజధానిలో జరుగుతున్న ఈ సమావేశం జనసేన రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# రెండేళ్ల తీర్పు..కూటమికి ప్లస్.


మొదటి పేజీ తరువాయి

ఎడిటర్ నరేంద్ర

రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ప్రస్తుతం రాజకీయంగా ముందంజలో కనిపిస్తున్నప్పటికీ, 2029 ఎన్నికల దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చంద్రబాబు ఎప్పటిలాగే ఇంటెలిజెన్స్ నివేదికలు, ఐవిఆర్ సర్వేలు, పార్టీ అంతర్గత అంచనాలపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు వాటిలో ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో అధికారంలో ఉన్న సమయంలో కూడా క్షేత్రస్థాయిలో ఉన్న అసంతృప్తి పూర్తిస్థాయిలో నివేదికల్లో ప్రతిబింబించకపోవడం వల్ల పార్టీ రాజకీయంగా మూల్యం చెల్లించుకున్న సందర్భాలను గుర్తు చేసుకుంటున్నారు. అందుకే ఈసారి కేవలం ఇంటెలిజెన్స్, ఐవిఆర్ నివేదికలకే పరిమితం కాకుండా ప్రజల మధ్య నుంచి వస్తున్న సంకేతాలను నేరుగా అర్థం చేసుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇదే సమయంలో జగన్ విమర్శలు కొంత మేర ప్రభావం చూపుతున్నప్పటికీ, ప్రస్తుత రాజకీయ వాతావరణం మాత్రం ఇంకా కూటమికే అనుకూలంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరోసారి ఎన్నికల కేంద్రంగా మారుతున్నాయి. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కూటమి, ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ ఇప్పటి నుంచే రాజకీయ వ్యూహాలను అమలు చేయడం ప్రారంభించాయి. రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్ల పాలన సంబరాలు నిర్వహిస్తున్న కూటమి నాయకత్వం, 2029లో కూడా అధికారంలోకి రావడం ఖాయమనే ధీమాను వ్యక్తం చేస్తోంది. తిరుపతిలో నిర్వహించిన భారీ సభ విజయవంతం కావడం, జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులు చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాజెక్టుల ప్రచారం కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.అయితే రాజకీయంగా కనిపిస్తున్న ఈ అనుకూల పరిస్థితి వెనుక కొన్ని కీలక హెచ్చరికలు కూడా దాగి ఉన్నాయి. అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వానికి ప్రతిపక్షం కంటే ప్రమాదకరమైనది ప్రజల్లో నెమ్మదిగా పెరిగే అసంతృప్తి. ఆ అసంతృప్తి క్షేత్రస్థాయిలో కనిపించకపోయినా ఎన్నికల సమయంలో ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం టీడీపీ అంతర్గత సర్వేలు, ఐవిఆర్ నివేదికలు, ఇంటెలిజెన్స్ అంచనాలు కూటమికి అనుకూలంగా ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, గ్రామస్థాయి కార్యకర్తలు చెబుతున్న అభిప్రాయాలు కొన్ని చోట్ల భిన్నంగా ఉన్నాయనే చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో కూడా నివేదికలపై అధికంగా ఆధారపడిన సందర్భాలు ఉన్నాయి. కానీ రాజకీయాల్లో నిజమైన నివేదిక ప్రజల మనసులో ఉంటుంది. అందుకే ప్రస్తుతం వస్తున్న ఇంటెలిజెన్స్ రిపోర్టులను మరోసారి క్రాస్ చెక్ చేసుకునే అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. జిల్లా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, యువత నుంచి నేరుగా సమాచారం సేకరించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం కనిపిస్తోంది.రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద బలం అమరావతి. గత ఎన్నికల్లో రాజధాని అంశం కీలక పాత్ర పోషించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నిర్మాణ పనులకు వేగం పెరగడం, పెట్టుబడిదారుల ఆసక్తి పెరగడం, కేంద్ర సహకారం లభించడం, మౌలిక వసతుల నిర్మాణం ప్రారంభం కావడం ప్రజల్లో సానుకూల సంకేతాలు పంపుతున్నాయి. ముఖ్యంగా రాజధాని ప్రాంత రైతుల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరిగింది. 2029 నాటికి అమరావతి స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంటే అది కూటమికి అతిపెద్ద రాజకీయ ఆయుధంగా మారే అవకాశం ఉంది.అయితే అమరావతి నిర్మాణం మాత్రమే సరిపోదు. అక్కడ ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, ఐటీ కంపెనీలు, సేవా రంగ విస్తరణ కనిపించాలి. యువతకు ఉద్యోగాలు లభించాలి. లేకపోతే అభివృద్ధి కేవలం నిర్మాణాలకే పరిమితమైందనే విమర్శలు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం చాలా జాగ్రత్తగా పరిగణించాల్సి ఉంటుంది.మరోవైపు నారా లోకేష్ ఎదుగుదల కూటమికి అదనపు బలంగా మారుతోంది. గతంతో పోలిస్తే ఆయన రాజకీయ శైలి పూర్తిగా మారింది. ప్రజల్లోకి వెళ్లడం, సమస్యలపై వెంటనే స్పందించడం, యువతతో అనుసంధానం పెంచుకోవడం, పార్టీ నాయకులను కలుపుకొని ముందుకు సాగడం వంటి అంశాలు లోకేష్‌కు ప్లస్‌గా మారాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. భవిష్యత్ నాయకత్వంగా లోకేష్‌ను అంగీకరించే వాతావరణం క్రమంగా పెరుగుతోంది.అయితే ఇక్కడే మరో రాజకీయ వాస్తవం కూడా ఉంది. పార్టీ పూర్తిగా ఒకే వర్గానికి పరిమితమైందనే భావన కలగకుండా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, యువతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. రాబోయే రోజుల్లో మంత్రివర్గ విస్తరణలు, నామినేటెడ్ పదవులు, సంస్థల నియామకాలలో సామాజిక సమతుల్యత పాటిస్తే అది రాజకీయంగా కూటమికి లాభదాయకంగా మారుతుంది.ఇక ప్రభుత్వానికి ప్రస్తుతం అత్యంత సున్నితమైన అంశం మైనింగ్ ఆరోపణలు. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులపై వస్తున్న ఆరోపణలు అధికార పార్టీకి ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంది. గతంలో అవినీతి ఆరోపణలను ప్రధాన అస్త్రంగా చేసుకొని అధికారంలోకి వచ్చిన కూటమి ఇప్పుడు అలాంటి ఆరోపణలపై రాజీ పడితే రాజకీయంగా నష్టపోయే అవకాశం ఉంది. ప్రజలు ప్రభుత్వాన్ని అభివృద్ధి ఆధారంగా మాత్రమే కాదు, పారదర్శకత ఆధారంగా కూడా అంచనా వేస్తారు. అందుకే మైనింగ్ వ్యవహారాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.రెవెన్యూ శాఖపై వస్తున్న విమర్శలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా 22-ఏ భూముల సమస్యలు, భూ వివాదాలు, రికార్డుల సవరణ, దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. అదే విధంగా పీజీఆర్ఎస్ వ్యవస్థలో సమస్యలను పరిష్కరించడం కంటే క్లోజ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులకు మంచి మార్కులు రావడం ఒకటి, ప్రజలకు న్యాయం జరగడం మరోటి. ఈ రెండింటి మధ్య తేడాను ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఉంది.పోలీస్ వ్యవస్థపై కూడా కూటమి కార్యకర్తల్లో మిశ్రమ అభిప్రాయాలు కనిపిస్తున్నాయి. గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పే కార్యకర్తలు ఇప్పుడు కూడా పూర్తిస్థాయి మార్పు కనిపించడం లేదని అంటున్నారు. ఈ భావన నిజమో కాదో పక్కన పెడితే, కార్యకర్తల్లో అలాంటి భావన ఉండటం కూడా రాజకీయంగా ముఖ్యమైన అంశమే.ఇక ప్రతిపక్షం విషయానికి వస్తే జగన్‌మోహన్ రెడ్డి పూర్తిస్థాయిలో ప్రభుత్వంపై దాడి కొనసాగిస్తున్నారు. సూపర్ సిక్స్ అమలు కాలేదని, వెన్నుపోటు రాజకీయాలు నడుస్తున్నాయని, రెడ్ బుక్ పరిపాలన కొనసాగుతోందని విమర్శలు చేస్తున్నారు. ఈ విమర్శలు కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపుతున్నాయి కూడా. ముఖ్యంగా స్థానికంగా ఎమ్మెల్యేలపై ఉన్న అసంతృప్తిని వైసీపీ రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తోంది.అయితే వైసీపీకి కూడా సవాళ్లు తక్కువగా లేవు. ముఖ్యంగా గతంలో ప్రజలు తిరస్కరించిన నాయకుల వ్యవహారశైలి ఇప్పటికీ మారలేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు నాయకులు ఇప్పటికీ అదే దూకుడు, అదే అహంకార ధోరణి, అదే భాష కొనసాగించడం పార్టీకి నష్టంగా మారుతోంది. జగన్ ఇప్పుడు చంద్రబాబును విమర్శించడం మాత్రమే కాకుండా తన పార్టీని పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో బలమైన నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి. అసెంబ్లీలో బలమైన ప్రతిపక్షంగా నిలవాలి.అమరావతి విషయంలో కూడా వైసీపీ ఇప్పటికీ ప్రజల్లో స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని చూపలేకపోయిందనే అభిప్రాయం ఉంది. కేవలం విమర్శలు చేస్తే సరిపోదు. ప్రజలు ప్రత్యామ్నాయ విధానాలను కూడా ఆశిస్తున్నారు. ఆ లోటు ప్రస్తుతం వైసీపీకి కనిపిస్తోంది.మొత్తంగా చూస్తే రెండేళ్ల పాలన అనంతరం రాజకీయ లెక్కల్లో కూటమికే స్వల్ప ఆధిక్యం కనిపిస్తోంది. అమరావతి, అభివృద్ధి, లోకేష్ ఎదుగుదల, కూటమి ఐక్యత, కేంద్రంతో సమన్వయం వంటి అంశాలు అధికార పక్షానికి బలంగా ఉన్నాయి. అయితే మైనింగ్ ఆరోపణలు, రెవెన్యూ సమస్యలు, కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి, కార్యకర్తల అసంతృప్తి వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తే అవే భవిష్యత్తులో ప్రమాదంగా మారే అవకాశం ఉంది.ప్రస్తుతం జగన్ విమర్శలు పూర్తిగా విఫలం కావడం లేదు. అదే సమయంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద అల కూడా కనిపించడం లేదు. అందుకే ఇప్పటికైతే రాజకీయ గాలి కూటమి వైపే వీస్తున్నట్లు కనిపిస్తోంది. కానీ రాజకీయాల్లో మూడు సంవత్సరాలు చాలా పెద్ద కాలం. చంద్రబాబు తన నేతలను కంట్రోల్ చేయగలిగితే, అమరావతిని విజయగాథగా మార్చగలిగితే, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించగలిగితే 2029లో కూటమికి మరో అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. లేకపోతే అదే అసంతృప్తిని ఆయుధంగా మార్చుకొని జగన్ తిరిగి రాజకీయ పునరాగమనం చేసే అవకాశాన్ని కూడా పూర్తిగా కొట్టిపారేయలేం. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మాత్రం ఎడ్జ్ కూటమిదే... కానీ అది శాశ్వతం కాదనే విషయాన్ని అధికార పక్షం గుర్తుంచుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

# మైనార్టీ విద్యార్థులకు వక్ఫ్ బోర్డు వరం

మొదటి పేజీ తరువాయి



అమరావతి రక్షణ న్యూస్...

మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ వక్ఫ్ బోర్డు సంయుక్తంగా చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం 'తాలీమ్-ఏ-హునర్' ద్వారా ఎంపికైన 250 మంది విద్యార్థులకు ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కాలేజ్ అలాట్‌మెంట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ, వక్ఫ్ మరియు ఉర్దూ అకాడమీ శాఖల మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదరికం కారణంగా చదువు మధ్యలో ఆగిపోకుండా ముస్లిం విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు కల్పించేందుకు వక్ఫ్ బోర్డు సొంత నిధులతో ముందుకు రావడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. సుమారు రూ.5 కోట్లకు పైగా వ్యయంతో ప్రతిభావంతులైన విద్యార్థులకు రెసిడెన్షియల్ విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నామని పేర్కొన్నారు.పదో తరగతిలో 450 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులను ప్రత్యేక టాలెంట్ టెస్ట్ ద్వారా ఎంపిక చేసి, రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో కర్నూలు, గుంటూరు, నిజామాబాద్ ప్రాంతాల్లో ప్రారంభమైన మైనార్టీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల స్ఫూర్తితో మరిన్ని విద్యా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మొత్తం 7,400 దరఖాస్తుల్లో 6,605 మంది పరీక్ష రాయగా, వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 250 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరి విద్య కోసం సుమారు రూ.6 కోట్లను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ముస్లిం విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలను ఎదుర్కొనే స్థాయికి ఎదగాలంటే నాణ్యమైన రెసిడెన్షియల్ విద్య అత్యవసరమని పేర్కొన్నారు .ప్రత్యేకంగా బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ 33 శాతం రిజర్వేషన్ కల్పించగా, ఆశించిన దానికంటే ఎక్కువగా 41 శాతం మంది బాలికలు ఎంపిక కావడం సంతోషకర పరిణామమని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను విజయవాడలోని ప్రముఖ విద్యా సంస్థల్లో చేర్పించి ఐఐటీ, మెడికల్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు వివరించారు.విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థులకు అందుతున్న ఈ అవకాశాలు వారి జీవితాలను మార్చగలవని అన్నారు. స్వర్ణాంధ్ర--2047 లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక రంగాల్లో మైనార్టీ యువత ముందుకు రావాలని సూచించారు. షాదీఖానాల్లో స్కిల్ డెవలప్‌మెంటకేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.ఎమ్మెల్సీ జకియా ఖానమ్ మాట్లాడుతూ పేద ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. ఎంపికైన విద్యార్థులు ఉన్నత స్థానాలు సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు .మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ మహ్మద్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. విద్యతోనే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని చెప్పారు.ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో విద్యావంతులు పెరిగితే ఆ కుటుంబం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు.ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ విద్యే ముస్లిం సమాజ అభ్యున్నతికి ప్రధాన మార్గమని చెప్పారు. ఈ విద్యా కార్యక్రమానికి తన వంతుగా రూ.1 లక్ష విరాళం ప్రకటిస్తూ భవిష్యత్తులో మరింత సహకారం అందిస్తానని వెల్లడించారు.రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూఖ్ షుబ్లీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆదాయాన్ని మైనార్టీ విద్యార్థుల విద్య కోసం వినియోగించడం దేశ చరిత్రలోనే అరుదైన నిర్ణయమని అన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారుల సంఖ్యను 2,500 మందికి పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.విజయవాడ డీసీపీ షరీనా బేగం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎ. తమీమ్ అన్సారియా కూడా విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వక్ఫ్ బోర్డు అధికారులు, ముత్తావలీలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .మైనార్టీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా వక్ఫ్ బోర్డు చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రంలో విద్యా రంగానికి కొత్త దిశానిర్దేశం చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# విద్యుత్ కోతలతో కంబదూరు విలవిల...

మొదటి పేజీ తరువాయి

అనంతపురం రక్షణ బ్యూరో...

అనంతపురం జిల్లా కంబదూరు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత రెండు నెలలుగా మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ అంతరాయాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఎప్పుడు విద్యుత్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు.. రోజుకు 20 నుంచి 30 సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ప్రజలను తీవ్ర అసహనానికి గురిచేస్తోంది.రాత్రి వేళల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి వేడి పూర్తిగా తగ్గకముందే విద్యుత్ కోతలు ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో తరచూ విద్యుత్ పోవడంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దెబ్బతింటున్న గృహోపకరణాలు...** తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, మళ్లీ అకస్మాత్తుగా అధిక వోల్టేజీతో రావడం వల్ల గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని ప్రజలు చెబుతున్నారు. టెలివిజన్లు, ఫ్రిజ్‌లు, మిక్సీలు, వాటర్ మోటార్లు, సెల్‌ఫోన్ ఛార్జర్లు, విద్యుత్ మీటర్లు వరకు పాడవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేసి కొనుగోలు చేసిన పరికరాలు కళ్లముందే పనికిరాకుండా పోతుండటంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నష్టం జరిగినా ఎలాంటి పరిహారం అందడం లేదని బాధితులు చెబుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

**విద్యార్థుల చదువులకు తీవ్ర అంతరాయం..** ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టాల్సిన సమయం. అయితే విద్యుత్ కోతల కారణంగా రాత్రి వేళల్లో చదువుకోవడం కష్టంగా మారిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆధారిత విద్యా విధానాలు విస్తరిస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయాలు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యాపారాలపై కూడా ప్రభావం...** కంబదూరు మండల కేంద్రంలో చిన్నచిన్న వ్యాపారులు కూడా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. వెల్డింగ్ షాపులు, కంప్యూటర్ సెంటర్లు, ఫోటో స్టూడియోలు, మిల్లులు, కిరాణా దుకాణాలు, ఇతర వాణిజ్య సంస్థలు తరచూ విద్యుత్ కోతలతో నష్టపోతున్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపార కార్యకలాపాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. జనరేటర్లు ఏర్పాటు చేసుకునే స్థోమత లేక చిన్న వ్యాపారులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.

**మూల సమస్య ఏంటి..?...** ప్రజలు, స్థానిక సిబ్బంది చెబుతున్న వివరాల ప్రకారం మండల కేంద్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. వందలాది ఇళ్లకు ఒకే పంపిణీ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. జనాభా పెరిగినా, కొత్త కాలనీలు ఏర్పడ్డా విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ మాత్రం జరగలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త ఫీడర్లు, పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా ప్రస్తుత వ్యవస్థపై అధిక భారం పడుతూ తరచూ ట్రిప్పింగ్ జరుగుతోందని సమాచారం.

**సిబ్బంది కొరతతో మరింత జాప్యం...** విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన శాఖలోనే సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని తెలుస్తోంది. మండల కేంద్రానికి శాశ్వత సాంకేతిక సిబ్బంది లేకపోవడం, పలు గ్రామాలకు ఒకే సిబ్బంది బాధ్యతలు నిర్వహించడం వల్ల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోంది. సహాయ ఇంజినీరు స్థాయి అధికారి లేకపోవడం కూడా మరో ప్రధాన సమస్యగా మారింది. చిన్న లోపం వచ్చినా మరమ్మతులకు గంటల సమయం పడుతోందని ప్రజలు చెబుతున్నారు. సమస్యలను పర్యవేక్షించే అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది.

**ప్రజల ఆవేదన... అధికారుల నిర్లక్ష్యమా?..** విద్యుత్ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి సారి 'అధిక లోడ్', 'సాంకేతిక సమస్య' వంటి కారణాలు చెబుతున్నారే తప్ప సమస్యకు మూల కారణాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సరఫరా అంశాన్ని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**మంత్రి జోక్యం అవసరం...** రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రకటిస్తున్న తరుణంలో కంబదూరు పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి విద్యుత్ శాఖ మంత్రి స్వయంగా జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం, కొత్త విద్యుత్ పంపిణీ కేంద్రాలు మంజూరు చేయడం, ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయడం, శాశ్వత ఇంజినీరింగ్ సిబ్బందిని నియమించడం ద్వారా మాత్రమే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఆందోళనల హెచ్చరిక...** సమస్యను వెంటనే పరిష్కరించి నిరంతర విద్యుత్ సరఫరా అందించకపోతే ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రజల్లో అసహనం పరాకాష్టకు చేరిందని, ఇకపై హామీలు కాదు..అజూ చర్యలు కావాలని కంబదూరు మండల ప్రజలు స్పష్టం చేస్తున్నారు. "విద్యుత్ కోతలతో విసిగిపోయాం... సమస్యను వెంటనే పరిష్కరించండి మంత్రి గారూ" అంటూ కంబదూరు ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రస్తుతం వారి దృష్టి మొత్తం విద్యుత్ శాఖ స్పందనపైనే నిలిచింది.

# ధీరజ్ ద్విగుణ స్వర్ణ విజయం

## అంతర్జాతీయ స్థాయిలో చాటిన విజయవాడ యువ ఆర్చర్...

ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్--×××లో మెన్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి విజయవాడకు చెందిన అంతర్జాతీయ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర మరోసారి దేశ గౌరవాన్ని ప్రపంచ వేదికపై ఎగురవేశాడు. ఆయన అద్భుత విజయంపై రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అమరావతి రక్షణ న్యూస్




ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్--III పోటీల్లో భారత యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర చరిత్రాత్మక ప్రదర్శన కనబరిచాడు. మెన్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ద్విగుణ స్వర్ణ పతకాలు సాధించి భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు తీసుకొచ్చాడు. విజయవాడకు చెందిన ధీరజ్ సాధించిన ఈ అరుదైన ఘనతపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి పోటీల్లో ధీరజ్ బొమ్మదేవర కనబరిచిన ప్రతిభ అసాధారణమని కొనియాడారు. అత్యున్నత స్థాయి పోటీలో రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకోవడం ద్వారా ధీరజ్ భారత క్రీడా పటిమను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాడన్నారు. ఈ విజయం కేవలం వ్యక్తిగత ఘనత మాత్రమే కాకుండా రాష్ట్ర యువతకు స్ఫూర్తినిచ్చే మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్చరీ వంటి అత్యంత పోటీ ఉన్న క్రీడలో ప్రపంచంలోని అగ్రశ్రేణి క్రీడాకారులను ఎదుర్కొని స్వర్ణ పతకాలు సాధించడం వెనుక ధీరజ్ కఠోర శ్రమ, పట్టుదల, అంకితభావం ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా నిరంతర సాధనతో ముందుకు సాగుతున్న ధీరజ్, ఇప్పుడు ప్రపంచ స్థాయిలో తన ప్రతిభను చాటుకోవడం ప్రతి తెలుగు వాడికి గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించడం రాష్ట్ర క్రీడా రంగం అభివృద్ధికి నిదర్శనమని మంత్రి అభిప్రాయపడ్డారు. యువ క్రీడాకారులు ధీరజ్ విజయాన్ని ఆదర్శంగా తీసుకుని తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమ ఉంటే ప్రపంచ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమేనని ధీరజ్ నిరూపించాడన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని భారత జాతీయ పతాకాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. ఒలింపిక్స్ సహా ప్రపంచ స్థాయి వేదికలపై మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తిని పెంచాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ధీరజ్ సాధించిన ఈ ద్విగుణ స్వర్ణ విజయం రాష్ట్ర క్రీడా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగనిలిచిపోతుందని పేర్కొన్న మంత్రి, ఆయన కృషి, అంకితభావం, సాధన పట్ల నిబద్ధత ఆంధ్రప్రదేశ్ యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని కొనియాడారు. ప్రపంచ వేదికపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన ధీరజ్ బొమ్మదేవర విజయంపై రాష్ట్రవ్యాప్తంగా క్రీడాభిమానులు, యువ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జగన్ పై మంత్రి సవిత ఫైర్

అనంతపురం రక్షణ న్యూస్




వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాష్ట్ర మంత్రి సవిత తీవ్ర స్థాయిలో రాజకీయ విమర్శలు గుప్పించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణ కోరింది కూడా, అనంతరం అదే విచారణను వ్యతిరేకించింది కూడా జగన్‌మోహన్ రెడ్డేనని ఆమె ఆరోపించారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి, సీబీఐ విచారణ అంశంపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు లేదని వ్యాఖ్యానించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ అధికారులు ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్టు చేసేందుకు వచ్చిన సమయంలో వారిని అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయని మంత్రి సవిత పేర్కొన్నారు. సీబీఐ దర్యాప్తుపై వైఎస్సార్సీపీ నేతల వైఖరి ప్రజలకు తెలిసిందేనని విమర్శించారు. డీఎస్సీ అంశాన్ని ప్రస్తావిస్తూ, వైఎస్సార్సీపీ పాలనలో ఐదేళ్లపాటు ఉపాధ్యాయ నియామకాల విషయంలో చిత్తశుద్ధి చూపలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేసిందని తెలిపారు. డీఎస్సీపై అనేక కేసులు వేయించి యువత భవిష్యత్తుతో ఆటలాడిందీ జగన్ నాయకత్వమేనని ఆమె విమర్శించారు. ఉపాధ్యాయులను గౌరవించే సంస్కారం జగన్‌కు లేదని, రాష్ట్ర యువత భవిష్యత్తును దెబ్బతీసిన నాయకుడిగా ఆయన నిలిచారని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి, యువత సంక్షేమం, ఉద్యోగ అవకాశాల కల్పనకే తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

# సింగపూర్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం

మొదటి పేజీ తరువాయి

సింగపూర్ : రక్షణ న్యూస్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం సింగపూర్ చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ అధికారులు, ప్రతినిధుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటోంది. సింగపూర్ చేరుకున్న ముఖ్యమంత్రికి అక్కడి తెలుగు సంఘాల ప్రతినిధులు, ఎన్నారైలు, ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా విమానాశ్రయం పరిసర ప్రాంతాలు తెలుగు ప్రజల సందడితో కళకళలాడాయి. సింగపూర్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబాలు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముఖ్యమంత్రికి స్వాగతం పలికాయి. పుష్పగుచ్ఛాలు అందజేస్తూ, జై తెలుగుదేశం, జై ఆంధ్రప్రదేశ్ నినాదాలతో సీఎం రాకను స్వాగతించారు. ప్రవాసాంధ్రులు చూపిన ఆప్యాయతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం ఆనందం వ్యక్తం చేశారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు, మహిళలు, యువతతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ వారితో ఫోటోలు దిగారు. ముఖ్యమంత్రి సరళంగా వ్యవహరించడం అక్కడి తెలుగు ప్రజలను ఆకట్టుకుంది. సింగపూర్‌లో నివసిస్తున్న ఎన్నారైలు రాష్ట్ర అభివృద్ధిపై తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తాము కూడా భాగస్వాములమవుతామని పలువురు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలు, సాంకేతిక రంగ అభివృద్ధిపై ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవాసాంధ్రుల పాత్రను కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ప్రతిభ, కృషి రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైల సహకారం ఎంతో కీలకమని చెప్పారు. విదేశాల్లో ఉన్నప్పటికీ మాతృభూమి పట్ల తెలుగు ప్రజలు చూపుతున్న ప్రేమ, అనుబంధం అభినందనీయమన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పలువురు పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి కీలక చర్చలు జరపనున్నట్లు సమాచారం. సింగపూర్‌లో తెలుగు ప్రజలు, ఎన్నారైలు అందించిన ఘన స్వాగతం ముఖ్యమంత్రి పర్యటనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల సాధన లక్ష్యంగా జరుగుతున్న ఈ పర్యటనపై ప్రభుత్వ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ఏపీకి పిడుగుల హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

అమరావతి రక్షణ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తాజా వాతావరణ హెచ్చరికను జారీ చేసింది. ఆదివారం మధ్యాహ్నం 2:50 గంటలకు విడుదల చేసిన బులెటిన్ ప్రకారం రాగల మూడు గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. పిడుగుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. పిడుగులు పడే సమయంలో చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల సమీపంలో, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడకూడదని అధికారులు హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే రైతులు, కూలీలు, మత్స్యకారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములు, మెరుపులు ప్రారంభమైన వెంటనే సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని తెలిపారు. విద్యుత్ పరికరాలను వినియోగించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, అవసరం లేని సందర్భాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులను కూడా సురక్షిత ప్రదేశాలకు తరలించాలని అధికారులు పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులకు లేదా విపత్తుల నిర్వహణ శాఖ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు సూచించింది. రాష్ట్రంలోని అప్రమత్త జిల్లాల్లో జిల్లా యంత్రాంగాన్ని కూడా సిద్ధంగా ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

# దీప్తి స్పిన్ మాయ.. పాక్ 106కే ఆలౌట్

మొదటి పేజీ తరువాయి

బర్మింగ్‌హామ్ : రక్షణ న్యూస్

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించిన భారత జట్టు 64 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో టోర్నీలో శుభారంభం చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో పోటీ స్థాయి స్కోరు నమోదు చేసింది. భారత బ్యాటర్లలో స్మృతి మంధాన కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు బలమైన పునాది వేసింది. ఆమె దూకుడైన ఆటతో పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచింది. రిచా ఘోష్ కూడా కీలక పరుగులు జోడించి జట్టు స్కోరును మరింత పటిష్టం చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పాకిస్థాన్ జట్టుకు భారత బౌలర్లు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ముఖ్యంగా స్పిన్నర్ దీప్తి శర్మ తన మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసింది. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టింది. ఆమె ధాటికి పాకిస్థాన్ బ్యాటింగ్ పూర్తిగా కుప్పకూలింది. దీప్తి శర్మ కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేస్తూ ఐదు వికెట్లు సాధించింది. ఆమె స్పిన్‌కు పాకిస్థాన్ బ్యాటర్లు సమాధానం కనుగొనలేకపోయారు. ఒకదశలో పోరాడే ప్రయత్నం చేసినా భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన ముందు నిలవలేకపోయారు. చివరకు పాకిస్థాన్ జట్టు కేవలం 106 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ 64 పరుగుల భారీ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లోనే అద్భుత విజయం సాధించిన భారత జట్టు టైటిల్ పోరుకు తాము సిద్ధంగా ఉన్నామనే సంకేతాలు ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో స్మృతి మంధాన, రిచా ఘోష్ రాణించగా, బంతితో దీప్తి శర్మ మ్యాచ్ హీరోగా నిలిచింది. ఆమె ఐదు వికెట్ల ప్రదర్శన భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. పాకిస్థాన్‌పై సాధించిన ఈ ఘన విజయం భారత జట్టులో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది.

26–5–26 rakshana main_Layout 1 6/15/2026 4:13 AM Page 4



# కృష్ణానదిలో విషాదం.. నలుగురు మృతి



## బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

## సింగపూర్ నుంచే పరిస్థితిని సమీక్షించిన సీఎం చంద్రబాబు

**పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణానదిలో పడవ బోల్తాపడి నలుగురు మృతి చెందిన విషాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో భాగంగా సింగపూర్‌లో ఉన్నప్పటికీ వెంటనే అధికారులతో ఫోన్‌లో సమీక్ష నిర్వహించి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.**

పల్నాడు జిల్లా రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా కోనూరు సమీపంలో కృష్ణానదిలో జరిగిన పడవ ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. నదిలో ప్రయాణిస్తున్న పడవ అకస్మాత్తుగా బోల్తాపడటంతో నలుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు నీటిలో చిక్కుకున్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ప్రమాదం జరిగిన వెంటనే పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, పోలీసు మరియు ఇతర ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, బాధితులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.ఈ ప్రమాదంలో మరణించిన నలుగురు బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా వెంటనే ఏరియా ఆసుపత్రికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని కూడా బాధిత కుటుంబాలకు అందజేశారు.జిల్లా కలెక్టర్‌తో పాటు ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆసుపత్రికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు.ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపేందుకు రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.పడవలో ప్రయాణిస్తున్న మిగిలిన ఆరుగురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. స్థానిక మత్స్యకారులు, పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సమన్వయంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టడం వల్ల మరింత ప్రాణనష్టం తప్పిందని అధికారులు తెలిపారు.ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను నది నుంచి వెలికితీసి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.ఈ సందర్భంగా నదుల్లో పడవ ప్రయాణాలు నిర్వహించే వారు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భద్రతా నిబంధనలను పాటించకుండా పడవలు నడపడం వల్లే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.ప్రమాదాలు పునరావృతం కాకుండా జిల్లాలోని మత్స్యకారులు, పడవ యజమానులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సోమవారం నుంచి వివిధ ప్రాంతాల్లో భద్రతా చర్యలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లైఫ్ జాకెట్లు వినియోగించడం, అనుమతులు పొందడం, ప్రయాణికుల పరిమితిని పాటించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.కృష్ణానదిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపగా, మృతుల కుటుంబాల రోదనలు హృదయాలను కలచివేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన తక్షణ సహాయం, విచారణ కమిటీ ఏర్పాటు, భవిష్యత్తు భద్రతా చర్యలు బాధిత కుటుంబాలకు కొంతమేర భరోసానిస్తున్నాయి.

# మంత్రి సవితతో కురుబ నాయకుల భేటీ



పెనుకొండ రక్షణ న్యూస్

రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవితను ఉమ్మడి అనంతపురం జిల్లా కురుబ ఉపాధ్యాయ, ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఇటీవల కురుబ ఉపాధ్యాయ సంఘం, కురుబ సంక్షేమ సంఘం పేర్లతో విడివిడిగా కొనసాగుతున్న రెండు సంఘాలను ఏకీకృతం చేసి ఒకే సంఘంగా ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రికి వివరించారు. సంఘాల ఐక్యతతో కురుబ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు మరింత సమర్థవంతంగా సేవలు అందించడంతో పాటు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం కలుగుతుందని నాయకులు తెలిపారు.సంఘం బలోపేతం, సభ్యుల సంక్షేమం, విద్యా మరియు ఉద్యోగ రంగాల్లో కురుబ వర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి సవితతో చర్చించారు. సంఘాల ఐక్యతను మంత్రి అభినందిస్తూ, కురుబ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కురుబ ఉపాధ్యాయ, ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ స్కూల్ నుంచి జాతీయ స్థాయికి - నాయుడుపేట బాలికల త్రిబుల్ ఐటీ సక్సెస్ సంచలనం

### అవకాశాలు ఉంటే ప్రభుత్వ పాఠశాలలే గెలుస్తాయి... ముగ్గురు బాలికల విజయం విద్యా వ్యవస్థకు బలమైన సమాధానం

నాయుడుపేట(జూన్ 14

నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ప్రతిభ మళ్లీ వెలుగులోకి వచ్చింది.ఈ పాఠశాలకు చెందిన కావలి పల్లవి, చేంజి భానుశ్రీ, బిందు మాధవి త్రిబుల్ ఐటీల్లో సీట్లు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు.నూజివీడు, ఒంగోలు త్రిబుల్ ఐటీల్లో అడ్మిషన్లు పొందినట్లు ప్రధానోపాధ్యాయులు కె.మనోజ్ కుమార్ వెల్లడించారు సాధారణ వనరులతో చదివిన ఈ విద్యార్థినులు అసాధారణ ఫలితాలు సాధించడం విశేషంగా నిలిచింది.ప్రైవేట్ పాఠశాలలతో పోటీగా ప్రభుత్వ పాఠశాలలు కూడా మెరుగైన ఫలితాలు ఇస్తున్నాయని ఈ విజయం స్పష్టం చేసింది.పాఠశాలలో ఉపాధ్యాయుల శ్రద్ధ,విద్యార్థుల పట్టుదల కలిసి ఈ విజయాన్ని సాధించాయి.ప్రతిరోజూ క్రమబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవడం వీరి ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ప్రభుత్వ పాఠశాల బాలికలు కూడా ఉన్నత లక్ష్యాలు సాధించగలరని వీరు నిరూపించారు.ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న అపోహలను ఈ ఫలితాలు చెదరగొట్టాయి.విద్యార్థుల విజయంతో పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, సదుపాయాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలంగా మారుతున్నాయి.ఈ విజయంతో పాఠశాలకి జిల్లాస్థాయిలో మంచి పేరు వచ్చింది.ఇది ఇతర విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ఇలాంటి విజయాలు కొనసాగుతూ ప్రభుత్వ పాఠశాలల గౌరవం మరింత పెరగాలని అందరూ ఆశిస్తున్నారు.

# ఆర్థిక లావాదేవీలకు పాన్ తప్పనిసరి

**ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంచడం, పన్ను ఎగవేతలను అరికట్టడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పాన్ కార్డు వినియోగాన్ని మరింత విస్తరించింది. భారీ విలువైన లావాదేవీలు, ఆస్తుల కొనుగోలు, షేర్ల వ్యాపారం, వాహనాల కొనుగోలు వంటి కీలక వ్యవహారాల్లో పాన్ కార్డు తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది.**

న్యూఢిల్లీ : రక్షణ న్యూస్

దేశంలో ఆర్థిక లావాదేవీలను మరింత పారదర్శకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అధిక విలువ కలిగిన లావాదేవీలకు పాన్ కార్డును తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. నల్లధనం, పన్ను ఎగవేతలను నియంత్రించడంతో పాటు ప్రతి ఆర్థిక లావాదేవీని ఆదాయపు పన్ను వ్యవస్థ పరిధిలోకి తీసుకురావడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

కొత్త నిబంధనల ప్రకారం రూ.20 లక్షలకు మించిన విలువ గల స్థిరాస్తుల కొనుగోలు, అమ్మకాల సమయంలో పాన్ కార్డు వివరాలు సమర్పించడం తప్పనిసరి. అలాగే రూ.2 లక్షలకు మించిన విలువైన వస్తువులు లేదా సేవల కొనుగోలు సమయంలో కూడా పాన్ నంబర్‌ను అందించాల్సి ఉంటుంది.షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారికి కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి. రూ.1 లక్షకు మించిన విలువ గల షేర్ల కొనుగోలు లేదా అమ్మకాల కోసం పాన్ కార్డు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. పెట్టుబడిదారుల ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించేందుకు ఈ నిబంధన ఉపకరిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.అదేవిధంగా రూ.5 లక్షలకు మించిన విలువ గల కారు లేదా ద్విచక్ర వాహనాల కొనుగోలు సమయంలో కూడా పాన్ వివరాలు ఇవ్వడం తప్పనిసరి చేశారు. విలాసవంతమైన వాహనాల కొనుగోళ్లలో పారదర్శకత తీసుకురావడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.డీమ్యాట్ ఖాతా ప్రారంభించాలనుకునే వారికి కూడా పాన్ కార్డు తప్పనిసరి. స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు నిర్వహించడానికి అవసరమైన డీమ్యాట్ ఖాతా తెరవాలంటే చెల్లుబాటు అయ్యే పాన్ నంబర్‌ను సమర్పించాల్సి ఉంటుంది.పాన్ వివరాలు అందించకుండా లావాదేవీలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తే సంబంధిత లావాదేవీలు నిలిచిపోయే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే తప్పుడు పాన్ వివరాలు సమర్పించినా లేదా తప్పుదారి పట్టించే సమాచారం ఇచ్చినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆదాయపు పన్ను శాఖ ప్రత్యేక పరిశీలనకు గురయ్యే ప్రమాదం కూడా ఉందని అధికారులు తెలిపారు.పన్ను వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణ పెంచడం, అక్రమ నగదు ప్రవాహాలను అరికట్టడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టినట్లు ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అధిక విలువ గల లావాదేవీలు నిర్వహించే వ్యక్తులు, వ్యాపార సంస్థలు కొత్త నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.




Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District